చేవెళ్ల సభను జయప్రదం చేద్దాం

● ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 12: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఈ నెల 13న చలో చేవెళ్ల భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చలో చేవెళ్ల భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరుకానున్నారన్నారు. చేవెళ్ల గడ్డపై మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరవేయడమే ఎజెండాగా ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా కష్టపడి పని చేయాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఎందన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి హృదయాల్లో నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మాటలను నమ్మి ప్రజలు మోసపోయారని గ్రహించారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధమైయ్యారని వివరించారు. ఈ నెల 13న చలో చేవెళ్ల భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

చేవెళ్ల సమావేశానికి భారీగా తరలివెళ్లాలి

మణికొండ, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు చేవెళ్లలో బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లాలని రాజేంద్రనగర్ మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మణికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని అన్నారు. నేడు జరిగే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

మణికొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు మల్లేశ్, రామకృష్ణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

ఉన్నత విద్యలో మార్పులు అవసరం

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో ఉన్నత విద్యా విధానంలో సమూల మార్పులు చేయాలని తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరస్వామి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వేర్వేరు విధానాలున్నాయన్నారు. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్నారు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లలో బీఏ, బీకాం, బీఎస్సీ మొత్తం సబ్జెక్టులన్నింటినీ ఒకే జాబితాగా చేయాలన్నారు. నచ్చిన ఏదైనా మూడు సబ్జెక్టులను ఎంపిక చేసుకునే విధంగా వీలు కల్పించాలన్నారు. డిగ్రీ సబ్జెక్టులతో సంబంధం లేకుండా పీజీలో ఎంట్రన్స్ రాయడానికి అవకాశం కల్పించాలని అన్నారు. అలాగే ఎన్ని కోర్సులైనా చదువుకునే వీలు కల్పించాలని, అందుకు స్కాలర్‌షిప్‌లను సైతం అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వేదిక కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ పద్మజాషా, చిత్రంలో గెడ్డం ఝాన్సీ, మూర్తి

రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 : రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం అని పలువురు వక్తలు నినదించారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన 'రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం' అనే అంశంపై సభ నిర్వహించారు. వక్తలుగా ప్రబుద్ధ భారత్ అడ్వైజర్ పీఎస్ఎన్ మూర్తి, విశ్రాంత ప్రొఫెసర్ పద్మజాషా, ప్రముఖ రాజకీయ విశ్లేషకురాలు కృష్ణకుమారి హాజరై ప్రసంగించారు. గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ.. రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవ హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని అవమానించాలని కొన్ని హిందుత్వ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తతో ముందుకు సాగుతూ.. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాలంటే బాబాసాహెబ్ అంబేద్కర్ అహర్నిశలు శ్రమించి రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశాన్ని సురక్షితంగా ఉంచుకోగలమని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 2 నుంచి 14వరకు ప్రజా చైతన్య కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. దళిత స్త్రీశక్తి జాతీయ, రాష్ట్ర కోఆర్డినేటర్లు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లో ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుర్తింపులేని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 12: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ బోర్డ్ అనుమతి లేకుండా కొనసాగుతున్న జూనియర్ కాలేజీలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని రిసోనెన్స్ కాలేజీ యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాలేజీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డ్ అధికారికంగా అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయకముందే కొన్ని కాలేజీలు అడ్మిషన్లను తీసుకోవడం, తరగతులను నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అనుమతులు ఉన్న కాలేజీలోనే చేరాలే తప్ప, కార్పొరేట్ కాలేజీల మాయజాలంలో పడి విద్యార్థులు నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, నాయకులు శ్రీమాన్, ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, మురళి పాల్గొన్నారు.

14న పటేల్ యూత్ ఫోర్స్ గర్జన

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: కరీంనగర్‌లో ఈనెల 14న జరిగే పటేల్ యూత్ ఫోర్స్ గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్‌పటేల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పగడాల అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పటేల్ యూత్ ఫోర్స్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని వీ కన్వెన్షన్‌లో గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. మున్నూరుకాపు విద్యార్థుల చదువుల కోసం వసతి గృహం సాధించుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అలాగే ప్రతిఒక్క మున్నూరుకాపు తమ పేర్లకు పటేల్‌ను జోడించుకోవాలని, పటేల్ గెజిట్‌ను సైతం సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గర్జనకు మున్నూరుకాపు జర్నలిస్టులు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న 'సత్య హరిశ్చంద్ర' ప్రదర్శన

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రంగస్థల నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీనివాస చైతన్య కళానాట్యమండలి కళాకారులు 'సత్య హరిశ్చంద్ర' నాటకాన్ని ప్రదర్శించారు. వారణాసి హరిశ్చంద్రగా బద్వేలు కిరణ్‌కుమార్, కాటికాపరిగా కుంచి దాసుబాబు, నక్షత్రకుడిగా ప్రసాదరాయచౌదరి, చంద్రమతిగా అడపా ప్రభావతి తదితరులు అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. అంతకుముందు గయోపాఖ్యానం యుద్ధసన్నివేశంలో శ్రీకృష్ణుడిగా ధూపం తిరుమలతేజ, అర్జునుడిగా ధూపం రామకృష్ణ తమ పద్యాలతో అందరినీ అలరించారు.

అంతర్జాతీయ సంబంధాలపై అవగాహన

మణికొండ, ఏప్రిల్ 12: గండిపేట్‌లోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నిలజీలో ఐక్యరాజ్య సమితి నమూనా(సీబీఐటీ) 2024 మూడు రోజుల అవగాహన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. నగరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తెలంగాణ హైకోర్టు ఈవీ వేణుగోపాల్, ఎన్ఆర్ఐ మహేశ్ బిగాల, కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధాలు, దౌత్య విధానాలపై చర్చించారు. విమర్శనాత్మక ఆలోచన, ప్రసంగాలు, చర్చలు, నైపుణ్యాలను అభివృద్ధిపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీబీఐటీ మున్ డైరెక్టర్ షగుప్తా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రొఫెసర్లకు అంతర్జాతీయ అవార్డు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: బంజారాహిల్స్‌లోని అంజద్ అలీఖాన్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన ప్రొఫెసర్ వై.వినోదినీరెడ్డి, డా.హిమబిందు మలేషియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రానికి అత్యుత్తమ అవార్డు లభించింది. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోదిని వివరాలను వెల్లడించారు. మలేషియాలో గత నెల 7న జరిగిన 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ హెల్త్ రిస్క్' అంతర్జాతీయ సదస్సులో వినోదినీరెడ్డి, హిమబిందు పాల్గొనడంతో పాటు 'రోల్ ఆఫ్ సెలెక్ట్ బిజినెస్ కాంగ్లోమేరేట్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు అత్యుత్తమ పరిశోధనా పత్రం అవార్డు లభించిందని. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్, చైర్మన్ మసూద్ అహ్మద్ ఖాద్రి వీరిని అభినందించారు.

14న సితార్ ఫర్ మెంటల్ హెల్త్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: సుప్రసిద్ధ సితార్ వాద్యకారుడు, సంగీత దర్శకుడు రిషబ్ రిఖిరామ్‌శర్మ ఈనెల 14న మాదాపూర్‌లోని డిస్ట్రిక్ట్ 150లో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యూర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శర్మ మాట్లాడుతూ.. సంగీతం ద్వారా అనేక రుగ్మతలను నయం చేయవచ్చని పురాతన కాలం నుంచి మనమంతా వింటున్నామని గుర్తుచేశారు. మానసిక ప్రశాంతత లోపించడం ద్వారా అనేక రకాలైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారి సంఖ్య ఇటీవల ఎక్కువైందని, అలాంటి వారికి స్వాంతన చేకూర్చాలన్న లక్ష్యంతో మూడేండ్లుగా తాను దేశవ్యాప్తంగా 'సితార్ ఫర్ మెంటల్ హెల్త్' పేరుతో కచేరీలు నిర్వహిస్తున్నానని వెల్లడించారు.

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేబీ శ్రీధర్

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 12: ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు గుడిని, గుడిలో ఉన్న లింగాన్ని మింగేలా పాలన చేస్తుందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఐపీసీ) జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి శివ పావని విమర్శించారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దొందూ దొందేనని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా దేశాన్ని ఏం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. పీఎం లూటా హే, సీఎం జుటా హే అని విమర్శించారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శివపావనిని భారీ మెజార్టీతో గెలిపించాలని శ్రీధర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేరరావు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు నర్సింహగుప్త, రామ సుబ్బారెడ్డి, జగదీశ్, నవీన్, ఎ.సరిత, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యనందించాలి

శంషాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రవీణ్‌కుమార్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 12: పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యనందించాలని చేవెళ్ల లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీగా తనను గెలిపిస్తే పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య నందించేందుకు లోక్‌సభలో చట్టం తీసుకువచ్చే విధంగా పోరాటం చేస్తానని చెప్పారు. దేశంలో 90 శాతం మంది ప్రజలు విద్య, వైద్యం అందుబాటులో లేకపోవడంతోనే పేదలుగా మారుతున్నాని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితాల పేరుతో దేశాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా కేవలం ఓకే వర్గానికి న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎక్కడ ప్రచారం నిర్వహించినా ప్రజల్లో మంచి స్పందన వస్తుందని, తాను గెలువడం ఖాయమేనని ధీమా వ్యక్తం చేశారు.

యువవకుడిపై దాడి.. దోపిడీకి యత్నం

వెంగళరావునగర్, ఏప్రిల్ 12: వ్యక్తిపై దాడిచేసి దోపిడీకి యత్నించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కృష్ణానగర్‌లో ఉండే మండా రమేశ్ (29) హైటెక్‌సిటీలో ఆఫీస్ బాయ్. ఈనెల 10న రాత్రి జానకమ్మతోట నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. నలుగురు ఆగంతకులు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పగా.. సెల్‌ఫోన్‌ను ఇవ్వాలని బెదిరించారు. నిరాకరించడంతో రమేశ్ తలపై రాయితో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో జనం రావడం చూసి దుండగులు పరారయ్యారు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దార్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 12: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 11న దుర్గానగర్‌లోని పల్లాడియం ఫంక్షన్‌హాల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడిఉన్నట్లు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందగా.. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి వయస్సు 55-60 ఏండ్లు ఉంటుందని, అతను పింక్ రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసిందన్నారు. ఆహారం లేక లేదా అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

ఫ్రీలెఫ్ట్ బ్లాక్ చేసే వారిపై కఠినంగా ఉండండి

● నో పార్కింగ్ జోన్లలో మరింత అవగాహన కల్పించండి

● సిబ్బందిని ఆదేశించిన ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిని ఎప్పటికప్పుడు హెచ్చరించడంతో పాటు పద్ధతి మార్చుకోకుంటే జరిమానాలు విధించడం ద్వారా కట్టడి చేయాలని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్‌తో కలిసి శుక్రవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ చౌరస్తా, అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నం. 1, 12 చౌరస్తా, జహీరానగర్ చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించారు. సిగ్నళ్ల వద్ద ఫ్రీలెఫ్ట్‌లు బ్లాక్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని, ఫ్రీ లెఫ్ట్‌లను బ్లాక్ చేయడంతో పాటు సిగ్నళ్లవద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు చౌరస్తాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. రద్దీ రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసే వాహనాలకు జరిమానాలు వేయడంతో పాటు మొబైల్ పార్టీలు తమ వద్ద అందుబాటులో ఉన్న పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తే అయా ప్రాంతాల్లో ఇతర వ్యక్తులు అప్రమత్తమమై సరైన రీతిలో పార్కింగ్ చేస్తారన్నారు. సిగ్నళ్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం శంషాబాద్ మండల ముచ్చింతల్, షాపూర్ తండా, మదన్‌పల్లి కొత్తతండా, సంఘీగూడ, బుర్జుగడ్డతండా, శంకరాపూర్, చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, హమీదుల్లానగర్, పోశెట్టిగూడ, రషీద్‌గూడ, బహదూర్‌గూడ గ్రామాల్లో ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎంపీగా పని చేసిన సమయంలో అనేక అభివృద్ధి పథకాలు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. మరోసారి తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు వడ్డె సుజాత, శ్రీరాంరెడ్డి, బీర్ల పెంటయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ రాజు, ప్రదీప్, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, ప్రశాంత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

వృద్ధులకు బట్టలను పంపిణీ చేస్తున్న కాల్వ సుజాత

మహిళలు అన్నిరంగాల్లో ప్రగతి సాధించాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 12: మహిళలు అన్నిరంగాల్లో ప్రగతి సాధించి సమాజ శ్రేయస్సు కోసం పాటు పడాలని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. వీబీజీ ఫౌండేషన్ వనితా విభాగం అధ్యక్షురాలు మడిపడిగె సత్యవతి ప్రసన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో చీరలు, కుట్టుమిషిన్లు, అనాథ, వృద్ధాశ్రమాల్లో నిత్యావసర వస్తువులు, బట్టలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మడిపడిగ రాజు, ప్రతినిధులు రామసత్యనారాయణ, డీఎస్ రావు, విజయలక్ష్మి, సంతోష్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు.. అప్పగించిన పోలీసులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: హైదరాబాద్ పర్యటనకు వచ్చి ఎస్‌బీఐ మేనేజర్ పర్సు పోగొట్టుకున్నది. పోలీసులు గుర్తించి తిరిగి ఆమె అందజేశారు. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం.. నూజీవీడుకు చెందిన మైత్రి ఎస్‌బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పంజాగుట్ట చౌరస్తాలో ఆమె పర్సు పడిపోయింది. ట్రాఫిక్ ఎస్సై మోహన్‌కుమార్ పర్సును గమనించి ఏటీఎం కార్డు ఆధారంగా ఆమెకు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పర్సును అప్పగించారు. పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం బాటిళ్ల తరలింపు.. కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పరిమితికి మించి మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తితో పాటు మద్యాన్ని విక్రయించిన షాపు నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని ముగ్దా షోరూమ్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు అటువైపు వచ్చిన కారును ఆపి పరిశీలించగా.. ఐదు కాటన్ల బీర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. పరిమితికి మించి మద్యం తరలిస్తున్న కారు డ్రైవర్ శివ లలిత్‌తో పాటు అతడికి మద్యం విక్రయించిన ఓ లిక్కర్ మార్ట్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెండు వాహనాలు ఢీ-గాయాలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 12: బొలెరో-ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అప్పారావు వివరాల ప్రకారం.. హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిలో శంషాబాద్ నుంచి సాతంరాయి వెళ్తున్న టీఎస్07 యూఎం 5499 నంబర్ బొలెరో వాహనం-సాతంరాయి నుంచి వస్తున్న ఏపీ 39 ఎల్‌జడ్ 9203 ద్విచక్ర వాహనాన్ని సాతంరాయి బ్రిడ్జి వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న భాస్కర్ అనే వ్యక్తి తలకు, కాలుకు తీవ్ర గాయాలైన్నట్లు తెలిపారు. పోలీసులు భాస్కర్‌ను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. బాధితుడు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఏకే టౌన్‌షిప్‌కాలనీకి చెందిన వ్యక్తి, కాగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్య